క్లుప్తంగా

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



పొన్నూరు(చేబ్రోలు): అగ్ని ప్రమాదాల సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా ఆస్తి, ప్రాణ నష్టం నివారించవచ్చునని పొన్నూరు అగ్నిమాపకశాఖాధికారి కె.ప్రసాద రావు అన్నారు. పొన్నూరు పట్టణ పరిధిలోని బాపట్ల రోడ్డులో మంగళవారం అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పెట్రోల్ బంక్‌లో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, స్థానికులకు, పెట్రోల్ బంక్ సిబ్బందికి అవగాహణ కల్పించారు. అగ్నిమాపకశాఖాధికారి ప్రసాద రావు పాల్గొన్నారు.

నగర శివార్లలో..

గుంటూరు రూరల్: వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఫైర్ ఆఫీసర్ పీ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం నగర శివారుల్లోని ఈస్ట్రన్ కంపెనీలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాలు, వాటి నివారణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం అగ్నిమాపక విన్యాసాలను ప్రదర్శించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 'చలపతి' ప్రతిభ



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి నైపుణ్యాలు కలిగిన విద్యతోపాటు ఉజ్వల భవిష్యత్‌ను అందించటం కళాశాల లక్ష్యమని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు పేర్కొన్నారు. మంగళవారం నగర శివారుల్లోని లాంలోని కళాశాలలో చెన్నైకి చెందిన ఈపీఐ సోర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో కళాశాలకు చెందిన 47 మంది విద్యార్థులు ఉద్యోగాలకు అర్హత సాధించారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, సంస్థ హెచ్ ఆర్ మేనేజర్స్ లక్ష్మణ, విష్ణుష్, అహ్మద్, ప్రవల్లిక ప్రత్యేకంగా అభినందించారు.

భీమేశ్వరస్వామికి మాస శివరాత్రి పూజలు



చేబ్రోలు: స్థానిక భీమేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చైత్రమాస మాస శివరాత్రి సందర్భంగా స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆర్.సత్యనారాయణశర్మ వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకారంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికురాలికి ఎమ్మెల్యే గిరిధర్ పరామర్శ

గుంటూరు ఈస్ట్: జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పారిశుద్ధ్య కార్మికురాలు కనపర్తి విమలను ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మంగళవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, ఆర్ఎంఓ సతీష్‌లను ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశుద్ధ్య విభాగం అధికారులు విమలను కొద్దిరోజుల నుంచి విధుల నుంచి తప్పించారన్నారు. అయితే ఆ విషయం తన దృష్టికి రావడంతో వెంటనే విధుల్లో చేర్చుకోవాలని సంబంధిత అధికారులను కోరినట్లు చెప్పారు. ఈ సమాచారం విమలకు చేరడం ఆలస్యమైందని పేర్కొన్నారు. విమల క్షణికావేశంలో ఆత్మహత్యాయత్నం చేయడం దురదృష్టకరమన్నారు. విమల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. విమలకు ఆమె కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

నెహ్రూనగర్: పారిశుద్ధ్య కార్మికురాలు విమలను నగరపాలక సంస్థ ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్ మంగళవారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతికి విజ్ఞప్తి చేశారు.

వివాదాస్పద భూముల జోలికి వెళ్లొద్దు

జేసీ రాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాజకుమారి, పక్కన గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, సర్వే శాఖ ఏడీ రూప్లా నాయక్ తదితరులు

పెదనందిపాడు(కాకుమాను): గ్రామాలలో వివాదాస్పదంగా ఉన్న పంట భూముల జోలికి వెళ్లొద్దని జాయింట్ కలెక్టర్ రాజకుమారి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని మీటింగ్ హాలులో మంగళవారం రీ సర్వేపై వీఆర్వోలు, గ్రామ సర్వేయర్‌లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైన ప్రవర్తిస్తే ఉద్యోగాలు కోల్పోవలసి వస్తుందని ఆమె సూచించారు.మండలంలో 12 రెవెన్యూ గ్రామాలకు గాను పది గ్రామాలకు ఓఆర్ఐ(ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్) వచ్చినట్లు ఆమె తెలిపారు. వాటిలో ఒక్క రాజుపాలెం గ్రామంలోనే రీ సర్వే పూర్తయినట్లు వివరించారు. మిగిలిన గ్రామాలలో కూడా రీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో వీఆర్‌ఓలు, గ్రామ సర్వేయర్‌లు సమన్వయంగా ఉండి రైతుల వివరాలు, వారి పేర్లు, పొలం వివరాలను సేకరించాలని చెప్పారు. అడంగళ్(మ్యూటేషన్)లో మార్పులు చేర్పులు ఉంటే వాటిని సరి చూసి వెంటనే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఎప్పుడో 1906లో రెవెన్యూ సర్వే చేశారు.. కాబట్టి ప్రతి వీఆర్‌ఓ రైతులతో మర్యాదగా మాట్లాడి వివరాలు సేకరించాలని కోరారు. ఒక్క డ్రోన్ కెమెరాతో రోజుకు 2,500 ఎకరాల్లో సర్వే చేయవచ్చునని వివరించారు. ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉన్న దృష్ట్యా రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో రీ సర్వే చేయాలని చెప్పారు. గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ ఓఆర్ఐ అయిన తర్వాత 90 రోజులలో పూర్తి చేయాలని కోరారు. గ్రామాలలో లేని రైతులను గుర్తించి వారి వివరాలు, ఆధార్‌కార్డు నంబర్‌లు సేకరించి వారికి సమాచారం అందజేసి ఇంటి వద్ద, పంట పొలాలపై స్టికర్‌లు, జెండాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సర్వే పూర్తయిన తరువాత రైతులకు భూ హక్కు పత్రం అందజేయనున్నట్లు దీనిలో క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీని ద్వారా రైతు తన సాగు పొలం ఎక్కడ ఉంది, ఎన్ని ఎకరాలు అనే విషయాన్ని స్వయంగా తెలుసుకునే విధంగా ప్రభుత్వం భూ హక్కు పత్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో సర్వే శాఖ ఏడీ రూప్లా నాయక్, డీఐఓఎస్ సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ మహ్మద్ సుభాని పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజనం చేయాల్సిందే

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసే విధంగా ఎంఈఓ, హెచ్ఎంలు తగిన చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని పలు గ్రామాలలోని పాఠశాలల్లో విద్యార్థినులు మధ్యాహ్న భోజనం చేయడం లేదనే విషయం తన దృష్టికి వచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి ప్రతి విద్యార్థి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ఫోర్టిఫైడ్ బియ్యంతో మధ్యాహ్నం భోజనాన్ని అందిస్తుండడంతో పాటు ప్రతి రోజు ఉదయం రాగి జావను అందిస్తున్నట్లు వివరించారు. రేపటి నుంచి ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజనం చేసే విధంగా కృషి చేయాలని ఎంఈఓను జేసీ ఆదేశించారు. కార్యక్రమంలో గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

పెదగొట్టిపాడులో జేసీ పర్యటన

పెదగొట్టిపాడు(ప్రత్తిపాడు): గ్రామంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి మంగళవారం పర్యటించారు. స్థానిక వీఆర్వో కాలనీలో ప్రస్తుతం ఉన్న శ్మశానవాటికకు ఉన్న స్థలం సరిపోవడం లేదని స్థలం కేటాయించాలంటూ కాలనీ వాసులు గతంలో అర్జీ పెట్టుకున్నారు. దీంతో స్థానిక అధికారులు గ్రామంలో 1.25 ఎకరాల భూమిని శ్మశాన వాటికకు ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో సంబంధిత ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ఆమె వెంట గుంటూరు ఆర్డీఓ ప్రభాకర్ రెడ్డి, తహసీల్దార్ సంజీవకుమారి ఉన్నారు.

పేదల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయం

- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- పొన్నూరు పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం



పొన్నూరులో సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు(చేబ్రోలు): పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు పట్టణ పరిధిలోని 7వ వార్డులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులో ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అందిన సంక్షేమ లబ్ధిని వివరించారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా పేదలు, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో అభివృద్ధి సాధించేందుకు ముఖ్యమంత్రి అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. మహిళలు, ఆర్థికాభివృద్ధి సాధించేందుకు పలు పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. నామినేటెడ్ పదవుల్లో 50శాతం మహిళలకే కేటాయించి మహిళా పక్షపాతిగా పేరు పొందారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన కొన్ని సమస్యలను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అక్కడక్కడే పరిష్కరించారు. మార్కెట్ యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, నాయకులు ఆరేటి మధుసూదనరావు, గాజుల సత్యనారాయణ, యెద్లూరి మస్తాన్‌రావు, నూర్‌బాషా అల్లాభక్షు, రుద్రపాటి ఆదిశేషు పాల్గొన్నారు.

కేంద్రం ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలి

సీపీఎం నాయకుడు నాగేశ్వరరావు



ర్యాలీలో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పెదనందిపాడు(కాకుమాను): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వెంటనే విడనాడాలని సీపీఎం నాయకుడు కాకుమాను నాగేశ్వరరావు అన్నారు. పెదనందిపాడు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను విచ్చల విడిగా అమలు చేస్తుందని దీని వలన పేద, మధ్య తరగతి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రోజు రోజుకు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను ఇష్టానుసారంగా పెంచుతుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మతోన్మాదులకు మద్దతు తెలుపుతూ దేశంలో కుల చిచ్చు పెడుతుందని మండిపడ్డారు. ఈనెల 30 తేదీ వరకు దేశ వ్యాప్తంగా నిరసనలు, ర్యాలీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అప్పటికి కేంద్ర ప్రభుత్వంలో మార్పు లేకుంటే తీవ్ర స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దొప్పలపూడి రమేష్, కొత్త శివ నాగేశ్వరరావు, కొత్త వెంకటశివ, చుక్కా యానాదులు, భువనేశ్వరి పాల్గొన్నారు.

శివాలయంలో నూతన నిబంధనలపై సర్వత్రా హర్షం

పెదకాకాని: శివాలయంలో నూతనంగా అమలు చేస్తున్న నిబంధనలపై భక్తులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకుల విధులు నిర్వహించే వ్యవహారంలో చోటు చేసుకున్న విభేదాలతో ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి కొత్త నిబంధనలకు శ్రీకారం చుట్టారు. గతంలో అర్చకులు కొందరు ఉదయం, మరికొందరు సాయంత్రం వంతుల వారీగా విధులు నిర్వహించేవారు. వారితో పాటు అదనంగా మరికొందరు అర్చకులు పూజలు చేసుకునేవారు. ఆలయంలో ఎంతో కాలంగా స్వామివారికి అర్చకులు వంతుల ప్రకారం నైవేద్యం పెట్టేవారు. ఒక వారం నైవేద్యం పెట్టిన భక్తుడికి నాలుగు నెలల తరువాత తిరిగి మళ్లీ స్వామివారికి నైవేద్యం పెట్టే అవకాశం వచ్చేది. కాలానుగుణంగా ఆలయంలో నైవేద్యం తయారు చేసేందుకు పాకాచారి పేరుతో ఒక వ్యక్తిని నియమించారు. ఆ తరువాత కొంతకాలానికి ఆలయంలో దాదాపు 40 మంది అర్చకులు ఉన్నప్పటికీ నైవేద్యం తయారు చేసిన వ్యక్తి ఆలయం వద్దకు తీసుకు వస్తే నైవేద్యం పెడతామని ఆలయ ఈఓ వద్ద పంచాయితీ పెట్టారు. స్వామివారి ఆలయంలో అంత మంది అర్చకులు ఉండి స్వామివారికి నైవేద్యం కూడా పాకాచారి వద్ద నుంచి తీసుకు వచ్చి పెట్టలేకపోతున్నారా అంటూ ఖండించడం కూడా జరిగింది. ఆలయంలో ఒక్కొక్క పూజా సేవలో కొందరిని కేటాయించి విధులు నిర్వహించేవారు. ఆ విధుల నిర్వహణలో తరుచూ వివాదాలు. ముఖ్యంగా రాహుకేతువుల వద్ద పూజలు చేసేందుకు అర్చకులు పోటీ పడేవారు. మరికొందరు ఆలయానికి సంబంధం లేని వ్యక్తులను రోజు వారీ వేతనం ఇచ్చి వారిచే పూజలు చేయించేవారు. ప్రస్తుతం ఆలయంలో ప్రతి అర్చకుడు రొటేషన్ పద్ధతిలో అన్ని పూజలు చేయాల్సి రావడం, అదనపు అర్చకులను తొలగించడం, బయట వ్యక్తులు పూజలు చేయడాన్ని నిలిపివేయడంతో మింగుడు పడటం లేదు.

ప్లేటు కలెక్షన్ నిలిపివేయడం..

పెదకాకాని శివాలయంలో అర్చకుల ప్లేటు కలెక్షన్‌ను ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి నిలిపివేయడంతో భక్తుల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. భక్తులు తమ కానుకలు హుండీలోనే సమర్పించుకుంటున్నారు. దేవదాయశాఖ ఆదేశాల మేరకు పలు దేవస్థానాలలో ప్లేటు కలెక్షన్‌లు నిలిపివేశారు.

వెయిట్ లిఫ్టర్‌ను అభినందించిన ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్



మల్లికార్జునరావుని అభినందిస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం: వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించిన మల్లికార్జునరావు భవిష్యత్‌లో మరెన్నో పతకాలు సాధించాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఆకాంక్షించారు. ఈనెల 15న తెలంగాణ మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు చేపట్టగా, సౌత్ ఇండియన్ మాస్టర్స్ వెయిట్ లిఫ్ట్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్ మల్లికార్జునరావు బంగారు పతకం సాధించారు. ఈ మేరకు అతన్ని మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రధాన రహదారులను అభివృద్ధి చేయాలి



ఆర్ అండ్ బీ అధికారులతో కలసి ప్రధాన రహదారులను పరిశీలిస్తున్న కార్పొరేటర్లు

నెహ్రూనగర్: గుంటూరు తూర్పు నియోజకవర్గం నుంచి నగరం బయటకు వెళ్లే రహదారులను అభివృద్ధి చేయాలని కార్పొరేటర్లు మొహమూద్, యిర్రి ధనలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకురాలు నూరి ఫాతిమా ఆర్ అండ్ బీ అధికారులను కోరారు. మంగళవారం తూర్పు నియోజకవర్గ పరిధిలోని పాత గుంటూరు ప్రధాన రహదారి, నందివెలుగు రోడ్డు తదితర ప్రాంతాలను ఆర్ అండ్ బీ ఎస్ఈ నిర్మలదేవి, డీఈఈ రాజేంద్రనాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందివెలుగు రోడ్డు రైల్వే గేటు వరకు అసంపూర్తిగా రోడ్డు ఉండటంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని, అదే విధంగా పొన్నూరు రోడ్డు, ఏటుకూరు రోడ్డు అసంపూర్తిగా ఉన్నాయని వాటిని కూడా అభివృద్ధి చేయాలని కోరారు. రోడ్లు నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శృంగారపు శ్రీనివాసరావు, మురళీ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు తోట మణికంఠ, నాగేశ్వరి పాల్గొన్నారు.



పట్టు తప్పిందా..!

పట్టు తప్పితే ప్రాణాలకు ముప్పు అని తెలిసినా.. పొట్టకూటి కోసం కొందరు కూలీలు ప్రమాదం అంచున ప్రయాణం చేస్తున్నారు. ఆటోవాలాలు నిబంధనలను విస్మరించి లగేజీ ఆటోల్లో గుంపులుగుంపులుగా కూలీలను ఎక్కించుకుంటున్నారు. అలాంటి చిత్రమే ఇది. గుంటూరు–పర్చూరు పాత మద్రాసు రోడ్డులో నిత్యం ఇలాంటి ఉల్లంఘనలు కనిపిస్తూనే ఉంటాయి.

– ప్రత్తిపాడు

'మా నమ్మకం నువ్వే జగన్'

గరికపాడు(కాకుమాను): 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు కోంద్రు అప్పారావు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈసందర్భంగా అప్పారావు మాట్లాడుతూ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తు ఆధారపడి ఉందని ఆయన తెలిపారు.

లారీ ఢీకొని మహిళ మృతి

గుంటూరు రూరల్: ద్విచక్ర వాహనంపై వెళుతున్న వారిని ఆయిల్‌ట్యాంకర్ ఢీకొనగా మహిళ మృతిచెందిన ఘటన మంగళవారం నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఒంగోలుకు చెందిన సి.హెచ్.రోజాకాంతం(52) నల్లపాడు గ్రామంలోని స్మార్ట్ సిటీ కాలనీలో నివసిస్తుంటారు. మంగళవారం సాయంత్రం మనవడికి అనారోగ్యంగా ఉండటంతో భర్త, కుటుంబ సభ్యులు కారులో చికిత్స నిమిత్తం గుంటూరు బయల్దేరారు. అదే విధంగా రోజాకాంతం తన కుమారుడి ద్విచక్ర వాహనంపై గుంటూరు బయల్దేరారు. నల్లపాడు సమీపంలో అతివేగంగా వెనుకగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో కుమారుడు వాహనం రోడ్డుపక్కన పడింది. రోజాకాంతం లారీ టైరు కింద పడి మృతి చెందింది. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి

గుంటూరు రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని కార్మికుడు మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఏడుకొండలు తెలిపిన వివరాలు.. మన్యెం జిల్లా పాలకొండ మండలం యరకరాయపురం గ్రామానికి చెందిన దేవర సాయి(30) కోల్డ్ స్టోరేజ్ మెకానిక్‌గా పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో నగర శివారుల్లోని కోల్డ్ స్టోరేజ్‌లలో నివాసం ఉంటూ పనిచేసుకుంటున్నాడు. తెల్లవారుజామున మిర్చియార్డు వైజంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సాయి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో విషయం తెలుసుకున్న నల్లపాడు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి చిన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వాటర్ ప్లాంట్ నిర్వాహకులపై కేసు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో వాటర్ ప్లాంట్ నిర్వాహకులపై ఆరు కేసులు నమోదు చేశారు. లీగల్ మెట్రాలజీ శాఖ డెప్యూటీ కంట్రోలర్ షాలేం రాజు ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో పలు వాటర్ ప్లాంట్‌లను మంగళవారం తనిఖీ చేశారు. ప్యాకింగ్ రూల్స్ నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను నిర్వాహకులపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. అసిస్టెంట్ కంట్రోలర్ కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్ సునీల్ రాజు పాల్గొన్నారు.

జీజీహెచ్ స్టాఫ్ నర్సుకు సన్మానం



విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న డాక్టర్ నీలం ప్రభావతి, పక్కన ఆషా సజని తదితరులు

గుంటూరు మెడికల్: అంతర్జాతీయ పారా సిట్టింగ్ వాలీబాల్ పోటీలకు గుంటూరు జీజీహెచ్ కాంట్రాక్టు స్టాఫ్ నర్సు వేల్పుల విజయ్‌కుమార్ ఎంపికయ్యారు. ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు చెన్నైలో జరిగిన జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి పారా వాలీబాల్ క్రీడలో పాల్గొని విజేతగా నిలవడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కజికిస్తాన్‌లో జూలై 3 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న టోర్నీకి హాజరుకానున్నారు. ఈమేరకు మంగళవారం గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ దేశ ఖ్యాతిని విజయ్‌కుమార్ ఇనుమడింప చేయాలనీ ఆమె ఆకాంక్షించారు. ప్రభుత్వాసుపత్రిలో విధి నిర్వహణలో ఎంతో చిత్తశుద్ధితో పనిచేసే విజయ్‌కుమార్ పారా వాలీబాల్ క్రీడకు భారతదేశం తరపున ఆడడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆషాసజని, ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వచ్ఛంద ప్రసాద్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులు సమస్యలను ఐక్యంగా పరిష్కరించుకోవాలి



నాగూర్ షరీఫ్‌ను సన్మానిస్తున్న డాక్టర్ ప్రభావతి, మినిస్టీరియల్ సిబ్బంది

గుంటూరు మెడికల్: ఏపీ ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన నాగూర్ షరీఫ్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు(ఆర్డీ) కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ షేక్ నాగూర్ షరీఫ్‌ను గుంటూరు జీజీహెచ్ శుశ్రుతహాలులో ఆస్పత్రి మినిస్టీరియల్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మానించారు. కార్యక్రమానికి మినిస్టీరియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతిబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు కలిగిన సంఘంలో పదవిని అధిరోహించడం అభినందనీయమన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కలిసి కట్టుగా పోరాటం చేయాలన్నారు. శని, ఆదివారాలు ప్రభుత్వ ఉద్యోగులందరికీ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో విశేష సేవలందించినందుకు డాక్టర్ ప్రభావతిని అసోసియేషన్ నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, సెక్రటరీ ఎస్.సతీష్ కుమార్, కోశాధికారి శ్రీధర్ రెడ్డి, నగర అధ్యక్షుడు సూరి, జీజీహెచ్ ఏడీ సి.హెచ్.నాగేశ్వరావు, ఏ ఓ పూసల శ్రీనివాసరావు, ఆర్డీ ఆఫీస్ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, అసోసియేషన్ నాయకులు డి.సాంబశివరావు, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యలో పరిశోధనలు సాగించాలి



జూపూడి రంగరాజును సత్కరిస్తున్న నాగభూషణం, సీతారామయ్య, విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఫార్మసీ విద్యలో పరిశోధనలు సాగించాలని హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో మంగళవారం డి.ఫార్మసీ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రంగరాజు మాట్లాడుతూ డి.ఫార్మసీ విద్యార్థులు ఈ–సెట్ పరీక్ష రాసి, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ వంటి ఉన్నత విద్యా కోర్సులు అభ్యసించాలని సూచించారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు మాట్లాడుతూ డి.ఫార్మసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులతో పాటు ఈఎస్ఐ, సీజీహెచ్ఎస్, రిటైల్ సేల్స్ రంగంలో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, ఫార్మా.డి డైరెక్టర్ పి. సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ కె.రవి కుమార్ పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లు కృషి మరువలేనిది



నెహ్రూనగర్: రజకుల సమస్యల పరిష్కారానికి బొంతల వెంకటేశ్వర్లు జీవితాంతం కృషి చేశారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. వెంకటేశ్వర్లు వర్ధంతిని పురస్కరించుకుని బ్రాడీపేటలో ఓ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీలను కలుపుకుని రాజకీయ శక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బహుజన సంఘాల నాయకులు వైకే, జీఆర్ భగత్ సింగ్, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, ఏడుకొండలు, శేషగిరి రావు పాల్గొన్నారు.